ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 52 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 2 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ముగిసిన మోడీ ధ్యాన ముద్ర

### తిరువళ్లూరు విగ్రహం వద్ద నివాళి
### ఢిల్లీకి తిరుగు ప్రయాణం

కన్యాకుమారి, జూన్ 1 (ప్రభాత ఉదయం): తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సుదీర్ఘ ధ్యానం ముగిసింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ధ్యానం.. 45 గంటలపాటు కొనసాగింది. ఈ క్రమంలోనే ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోదీ పూలమాల వేసి, నివాళులర్పించారు.



## ఇండియా కూటమికి 295 సీట్లు ఖాయం

### కూటమి నేతలతో సమావేశంలో ఖర్గే ధీమా

న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి 295 సీట్లకు పైగా వస్తాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. 'ఇండియా' కూటమి పార్టీల నేతలతో శనివారం సమావేశానంతరం వారంతా గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, తమ కూటమికి 295కి పైగానే సీట్లు వస్తాయని, ఆ సంఖ్య కూడా దాటవచ్చని, అంతకంటే మాత్రం తగ్గవని చెప్పారు. ప్రజలు ఇచ్చిన సమాచారం, ప్రజల సర్వే ఆధారంగా తాము ఈ విషయం చెబుతున్నామని అన్నారు. ప్రభుత్వ సర్వేలపై మాట్లాడుతూ, ప్రభుత్వాలకు సర్వేలు కూడా ఉంటాయని, సర్వేలకు వాళ్లకు (బీజేపీ) చాలా మార్గాలుంటాయని, మీడియా కూడా వారి పాక్షిక సత్యాలను హైలైట్ చేస్తుంటాయని అన్నారు. తమ కూటమి ఐక్యంగా ఉందని, ఇకముందు కూడా ఐక్యత ఇలాగే కొనసాగుతుందని, తమ ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు ఎవరూ చేయలేరని చెప్పారు.


# మళ్లీ మోడీకే పట్టం




### దేశవ్యాప్తంగా ప్రజల తీర్పు
### అన్ని ఎగ్జిట్ ఫలితాల్లో ఎన్‌డిఎకు మొగ్గు
### 400 సీట్ల సంఖ్యను చేరుకోదని వెల్లడి
### ఇండియా కూటమికి పెరిగిన బలం
### బలమైన ప్రతిపక్షంగా చేరుకునే అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం): మోడీ మూడోమారు ప్రధాని కావడం ఖాయమని ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. మరోమారు బిజెపి కూటిమిదే అధికారమని తేల్చింది. దాదాపు అన్ని సంస్థలు నంబర్ అటుఇటుగా ఎన్‌డిఎకు మరోమారు ప్రజలు పట్టం కట్టారని వెల్లడించాయి. అదే సందర్భంలో కాంగ్రెస్ గతం కన్నా భారీగా సీట్లను సంపాదించుకుంది. ఇండియా కూటమి కూడా గణనీయంగా సీట్లు సంపాదించి గట్టి ప్రతిపక్షంగా రాబోతోందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇకపోతే ఈ దఫా 400 సీట్లు అన్న బిజెపి కలలు మాత్రం నెరవేరేలా కనిపించడం లేదు. దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి శనివారం సాయంత్రి వివిధ సంస్థలు తమ సర్వేలను ప్రకటించాయి. వివిధ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసాయి. వివిధ సర్వేలు ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటన్నిటి ఆధారంగా దేశంలో ఎవరు అధికారంలోకి రానున్నారో అంచనా వేశాయి. ముచ్చటగా మూడో సారి కూడా ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుందని దాదాపు అన్ని సర్వేల ఫలితాలు చెబుతున్నాయి. ఎన్డీఏ కూటమి గరిష్టంగా 390 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉన్నాయి. రిపబ్లిక్ – పీమార్క్, ఇండియా న్యూస్ డీ వెల్లడించింది. డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మ్యాట్రిజ్ చేసిన సర్వేలు 300 పైగా స్థానాలు కమలం పార్టీ గెలుస్తుందని చెబుతున్నాయి. సుదీర్ఘంగా ఏడు దశల్లో సాగిన సార్వత్రిక ఎన్నికల సమరం తుది పోలింగ్ శనివారం ముగిసింది. దీంతో ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ మళ్లీ ఎన్డీయేనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఊహిస్తున్నాయి. వరుసగా మూడోసారి ..మిగతా 2లో

## తెలంగాణలో హస్తానిదే ఆధిపత్యం



హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం): సర్వత్రా ఉత్కంఠ రేపుతున్న ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఎట్టకేలకు విడుదల అయ్యాయి. అన్ని పార్టీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా.. సర్వే సంస్థలు ప్రజల నాడి ఎలా ఉందని తేల్చాయి. ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారు..? ఎన్నికల్లో విజేతగా నిలిచేది ఎవరు..?.. తెలంగాణ ఎగ్జిట్ పోల్ ఫలితాలు విడుదల కావడంతో.. ఈ ఎంపీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ కాస్త పెరిగింది. తెలంగాణలో మొత్తం 17 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో ఎవరెవరికి ఎన్ని సీట్లు రానున్నాయన్నది.. ఆయా సంస్థలు సర్వే ఫలితాలు వెల్లడించనున్నాయి. ఫలితాలకు మరో 3 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో.. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సర్వే సంస్థల ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ..మిగతా 2లో



## నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

### గవర్నర్‌ను కలిసి ఆహ్వానించిన సిఎం
### ఉదయం గన్‌పార్క్‌లో సిఎం రేవంత్ నివాళి
### ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు
### జయజయహే తెలంగాణ గీతావిష్కరణ
### కవులు, కళాకారులు, ఉద్యమకారులకు సన్మానం

హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకల్లో అందరినీ భాగస్వాములను చేయనుంది. గత పదేండ్లలో లేని విధంగా అందరినీ కలుపుకుని, రాజకీయాలకు అతీతంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఉదయమే గన్‌పార్క్ వద్ద అమరులకు సిఎం రేవంత్ నివాళి అర్పించి, అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ రాధాకృష్ణన్‌ను సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు స్వయంగా ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా రావాలని సోనియాను ఆహ్వానించినా ఆమె రాక అనుమానమని అంటున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జూన్ 2న ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ సందర్భంగా జయజయే తెలంగాణ గీతాన్ని సిఎం రేవంత్ జాతికి అంకితం చేయనున్నారు. కళాకారులు, కవులు, ఉద్యమకారులను ..మిగతా 2లో


## కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీర్పు



### 5వతేదీకి రిజర్వ్ చేయడంతో తప్పని నిరాశ
### నేడు తీహార్ జైలుకు వెళ్లక తప్పని పరిస్థితి

న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం): సుప్రీంకో గత నెలలో మంజూరు చేసిన మధ్యంతర బెయిలును పొడిగించాలంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పెట్టుకున్న దరఖాస్తుపై తీర్పును ఢిల్లీ కోర్టు ఈనెల 5వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో ఈనెల 2వ తేదీన తిరిగి తీహార్ జైలు అధికారుల ముందు కేజ్రీవాల్ లొంగిపోవడం అనివార్యం కానుంది. ఆరోగ్య కారణాలు, వైద్య పరీక్షల రీత్యా ముందస్తు బెయిలు గడువును పొడిగించాలంటూ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనతో విచారణ ..మిగతా 2లో

## తిరోగమన దిశలో కాంగ్రెస్ పాలన



### తెలంగాణ ఉద్యమాన్ని రక్తసిక్తం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది
### అందుకే మీరు నిర్వహించే ఉత్సవాల్లో మేము పాల్గొనం
### రేవంత్ రెడ్డికి కెసిఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ అభివృద్ధి తిరోగమన దిశలో సాగిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో పాల్గనరాదని నిర్ణయించినట్లు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ ..మిగతా 2లో

## ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

### ఏడు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్
### బెంగాల్‌లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు
### సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ



న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగిసింది. మొత్తం ఏడు విడతల్లో జరిగిన ఎన్నికలు.. శనివారం జరిగిన ఏడో దశ పోలింగ్‌తో ముగిశాయి. దీంతో అందరి చూపు జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌వైపు పడింది. ఏడో దశలో భాగంగా ఏడు రాష్ట్రాల్లోని 57 అసెంబ్లీ స్థానాలకు, ఒడిషాలోని 42 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది. చండీగఢ్‌తో పాటు పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 13 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో 9, బీహార్‌లో 8, ఒడిశాలో 6, జార?ండ్‌లో మూడు స్థానాలకు శనివారం పోలింగ్ ముగిసింది. ఒడిశాలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు, ..మిగతా 2లో



## బిఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

### గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కెసిఆర్

హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ కొనసాగనుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జంట నగరాల పార్టీ శ్రేణులతో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని హాజరయ్యారు. ఇదిలావుంటే అంతకుముందు కేసీఆర్ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. శనివారం సాయంత్రం లక్డీకపూల్ వద్ద భారీగా ట్రాఫిక్ ..మిగతా 2లో

## ఏపిలో ఎన్‌డిఏ కూటమిదే అధికారం

### విపక్షానికి పరిమితం కానున్న వైకాపా
### తెలంగాణలో ఎంపి సీట్లను పెంచుకోనున్న కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వివిధ మీడియా హౌస్‌లు, సర్వే సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని క్రోడీకరించి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందో అంచనా వేశాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో ఏపీలో ఇంతకుముందెన్నడూ నమోదు కాని విధంగా అత్యధికంగా 82.37శాతం పోలింగ్ నమోదైంది. భారీ పోలింగ్ తగినట్లుగానే ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. ఏపీలో తెదేపా, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 2,387 మంది ..మిగతా 2లో

# నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి...

సన్మానించానున్నారు. ఇకపోతే గత ప్రభుత్వం 2014 నుంచి 2023 దాకా పదేండ్లలో ఒక్కసారి కూడా ఉద్యమకారులను ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలని ఉద్యమకారులందరికీ ఆహ్వానం పంపించింది. కలెక్టర్ల ద్వారా ఆహ్వానాలు వెళ్లాయి. ఆవిర్భావ వేడుకల్లో ఆదివారం ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు ఉంటుంది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్నివాల్, లేజర్ షో లాంటి కార్యక్రమాలతో పాటు ఫుడ్, గేమింగ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్ బండ్ పై జాతీయ జెండాలతో మార్చ్-ఫాస్ట్ కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సీఎం రేవంత్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా రావడం లేదని తెలుస్తోంది. అంతకంటే ముందే ఈ అంశం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. సోనియా ఆహ్వానాన్ని బీజేపీ నేతలు తప్పుబట్టారు. అయితే తెలంగాణ దేవత అయిన సోనియాను ఎందుకు ఆహ్వానించకూడదని ప్రశ్నించారు అధికార పార్టీ నేతలు. చివరికి వ్యక్తిగత కారణాలతో సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు అయ్యింది. జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెట్టి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆవిర్భావ వేడుకలకు సోనియాను ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన భేటీలో కేబినెట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఢిల్లికి వెళ్లి ముఖ్య అతిథిగా రావాలంటూ ఆహ్వానించారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే ఈ వేడుకలకు సోనియా గాంధీ హాజరు కావడం లేదని ఏఐసీసీ తెలిపింది. అనారోగ్యం కారణాలతో సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు చేసుకున్నట్లు పేర్కొంది. కాగా,



షెడ్యూల్ ప్రకారం ఆదివారం సోనియా గాంధీ తెలంగాణకు రావాల్సి ఉంది. వైద్యుల సూచన మేరకు తెలంగాణ పర్యటనకు రాలేకపోతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ 10 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాజ్ భవన్ వెళ్లి రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రావాలని గవర్నర్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పూల బోకే ఇచ్చి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. దీంతోపాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు ప్రకటించారు. ఈ ఆంక్షలు శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆయన్ను ఆహ్వానించారు.

## రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తయి పదకొండవ సంవత్సరంలో అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఏళ్లకేళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నాయకులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 2వ తేదీకి అత్యంత ప్రాధాన్యముందని, ఈ రోజుతో తెలంగాణ స్వరాష్ట్రానికి సంపూర్ణ విముక్తి లభించిందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తపరిచారు. విభజన చట్టం ప్రకారం ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇకపై తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుందని గుర్తు చేశారు. ఇకపై విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో సింహభాగం మన రాష్ట్ర ప్రజలకే దక్కుతాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిన బూనారు. గడిచిన పదేండ్లలో తెలంగాణలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టడంతో పాటు, ఇంతకాలం కోల్పోయిన ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రమై పదేండ్లు పూర్తిచేసుకున్న చారిత్రక సందర్భంలో రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటాలు త్యాగాలను స్మరించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన దశాబ్ది వేడుకలను ముగించుకునే సందర్భంలో అమరులకు ముందుగా నివాళి అర్పిద్దామన్నారు. ప్రజాస్వామిక వాతావరణంలో పార్లమెంటరీ పంథాలో బీఆర్ఎస్ పార్టీ అస్తిత్వ రాజకీయ వేదికగా ప్రజలందరి భాగస్వామ్యంతో తెలంగాణ సాధించుకున్నామని కేసీఆర్ అన్నారు. రాష్ట్ర సాధనకోసం భావజాలవ్యాప్తి సాగించి తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను సకలజనులకు బోధించి., పోరాటంలో సబ్బండ వర్గాలను సమీకరించి అనేక వ్యూహాలను ఎత్తుగడలను అమలుపరిచి కేంద్రాన్ని కదిలించి, తెలంగాణకు సానుకూలంగా దేశంలోని మెజారిటీ రాజకీయ పార్టీలను ఒప్పించి, తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన చారిత్రక సందర్భాలని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. ఎన్నో త్యాగాలకోర్చి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో పటిష్ట పరుచుకుంటూ సమర్థవంతంగా పాలనను అందించిన పదేండ్ల స్వయంపాలనకాలం దేశానికి అభివృద్ధి సంక్షేమ రంగాల్లో తెలంగాణను ఒక రోల్ మోడల్‌గా నిలిపిందన్నారు. అమరుల త్యాగాలను వృథా పోనీయకుండా పదేండ్ల పాటు ప్రజల భాగస్వామంతో సాధించిన ప్రగతిని ప్రజాసంక్షేమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. బాధ్యతతో చిత్తశుద్ధితో, వ్యక్తిగత ద్వేష భావనలకు తావివ్వకుండా , తెలంగాణ సమాజ ప్రగతి,సంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిజమైన ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తినందుకొని ముందుకుసాగడం ద్వారానే ప్రస్తుత ప్రభుత్వం అమరుల ఆకాంక్షలను నెరవేర్చగలదని కేసీఆర్ స్పష్టం చేసారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళి అర్పించేందుకు శనివారం కొనసాగిన అమర జ్యోతుల (కొవ్వొత్తుల) ర్యాలీ ని విజయవంతం చేయడం పట్ల పార్టీ శ్రేణులకు తెలంగాణ వాదులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా జూన్2., జూన్3 తేదీల్లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొని నాటి ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ..విజయవంతం చేయాలని మరోసారి కేసీఆర్ పార్టీ శ్రేణులకు తెలంగాణ వాదులకు పిలుపునిచ్చారు.

## మళ్లీ మోడీకే పట్టం

మొదటి పేజీ తరువాయి...

మోదీ ప్రధాని పదవిని అధిరోహిస్తారని చెబుతున్నాయి. రిపబ్లిక్-పీ మార్క్, ఇండియా న్యూస్- డీ డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మొదలైన సర్వే సంస్థలు ఎన్డీయే కూటమి 350కి పైగా స్థానాలు సంపాదిస్తుందని ప్రకటించాయి. రిపబ్లిక్ భారత్-పి మార్క్ అంచనా ప్రకారం ఎన్డీయే 359 సీట్లు, ఇండియా కూటమి 154, ఇతరులు 30 సీట్లు గెలుచుకుంటారు. రిపబ్లిక్-మ్యాట్రైజ్ ప్రకారం.. ఎన్డీయే 353-368 సీట్లు, ఇండియా కూటమి 118, ఇతరులు 43-48 సీట్లు గెలుచుకుంటారు. ఇండియా న్యూస్-డి-డైనమిక్స్ అంచనా ప్రకారం.. ఎన్డీయే 371 సీట్లు, ఇండియా కూటమి 125 సీట్లు, ఇతరులు 47 సీట్లు గెలుచుకుంటారు. అలాగే జన్‌కీ బాత్ సర్వే కూడా ఎన్డీయేకే ఓటు వేసింది. ఆ సర్వే ప్రకారం.. ఎన్డీయే 362-392 సీట్లు, ఇండియా కూటమి 141-161 సీట్లు, ఇతరులు 10-20 సీట్లు గెలుచుకుంటారు. ఎన్డీటీవీ పోల్స్ ఆఫ్ పోల్స్ ప్రకారం ఎన్డీయే 365 సీట్లు, ఇండియా కూటమి 142 సీట్లు, ఇతరులు 36 సీట్లు గెలుచుకుంటారు. టీవీ9 పోల్ స్ట్రాట్, పీపుల్స్ ఇన్‌సైట్ ఎగ్జిట్ పోల్స్ 2024 ఫలితాలను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి సంచలన సర్వే విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 25 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అంచనాలను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని 25 లోక్ సభ స్థానాలకు ఎన్డీయే కూటమికి 12 స్థానాలు స్తాయని అంచానా వేసింది. అందులో తెలుగుదేశం పార్టీకి 9 స్థానాలు కైవసం చేసుకోగా.. జనసేనకు 1, బీజేపీకు 2 స్థానాలు వస్తాయని పేర్కొంది. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్ఆర్సీపీకి 13 స్థానాలు వస్తాయని తెలిపింది. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 8 సీట్లు సాధిస్తుందని తెలిపింది. అలాగే బిజెపికి 7, బీఆర్ఎస్ 1, ఎంఐఎం 1 స్థానంలో విజయం సాధించనున్నట్లు తెలిపింది. ఆరా మస్తాన్ సర్వే ప్రకారం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 6 నుంచి 8 పార్లమెంట్ స్థానాలు వస్తాయన్నారు. ఇక బీజేపీకు 8 నుంచి 9 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకుంటుదని తెలిపింది. ఇతరులకు 1 స్థానం అని ప్రకటించింది. అందులో బీఆర్ఎస్, ఎంఐఎంలకు ఎవరికైనా రావొచ్చు అన్నారు. ఇదే ఆరా మస్తాన్ గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఖచ్చితమైన అంచనాలను వెలువరించారు.

## ఎపిలో ఎన్‌డిఎ కూటమిదే అధికారం

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది పోటీలో ఉండగా.. అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీ చేశారు. మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది బరిలో ఉన్నారు. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, పిఠాపురం అసెంబ్లీ బరిలో పవన్ సహా 13 మంది పోటీలో నిలిచారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ సహా 27 మంది పోటీ చేశారు. తెలంగాణలో ఐదు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో ఏబీపీ – సీ ఓటర్ వంద శాతం ఖచ్చితమైన అంచనాలను వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ 64 అసెంబ్లీ సీట్లను సాధించబోతోందని బీఆర్ఎస్ పార్టీ 40 లోపు సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసింది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లోనూ ఎగ్జిట్ పోల్స్ ను ఏబీపీ – సీ ఓటర్ నిర్వహించింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు భిన్నత్వం ఎక్కువగా కనిపిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగా జరగడం వల్ల ఓటింగ్ ప్రయారిటీ అంశాలు మారిపోయాయి. అందుకే ఫలితాల్లోనూ భిన్నత్వం కనిపిస్తోంది. తెలంగాణలో ఏబీపీ – సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ అంచనాల్లో మొదట ఓట్ షేర్‌ను పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఏపీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అత్యధికంగా 52.9 శాతం ఓట్లు సాధిస్తుందని ఏబీపీ న్యూస్ – సీ ఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. తర్వాత వైఎస్ఆర్‌సీపీకి 41.7 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. అలాగే వైఎస్ షర్మిలా రెడ్డి కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని కొంత మెరుపరిచారు. గత ఎన్నికల్లో ఒక్క శాతం కన్నా తక్కువే ఓట్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ సారి మెరుగైన ఓట్లు సాధించబోతోంది. ఈ సారి 3.3 శాతం ఓట్లు వస్తాయని ఏబీపీ – సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఇతరులు 2.1 శాతం ఓట్లు సాధించే అవకాశాలు ఉన్నాయి. సీట్ల ప్రకారం చూస్తే.. 52.9 శాతం ఓట్లు సాధిస్తున్న ఎన్డీఏ కూటమి ఆటోమేటిక్ గా స్వీప్ చేయంగా కనిపిస్తోంది. మొత్తం ఇరవై ఐదు లోక్ సభ సీట్లలో 21 నుంచి 25 సీట్లు కూటమి పార్టీలు సాధించే అవకాశాలు ఉన్నాయి. వైఎస్ఆర్‌సీకి 0 నుంచి 4 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. అంటే వైఎస్ఆర్‌సీపీ ఖచ్చితంగా గెలిచే లోక్ సభ సీటు ఒక్కటి కూడా లేదని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఏబీపీ – సీఓటర్ ఎగ్జిట్ పోల్ పూర్తిగా లోక్ సభ నియోజకవర్గాలకు సంబంధించినదే. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. ఈ లోక్ సభ సీట్ల నిష్పత్తిలోనే అసెంబ్లీ సీట్లను కూడా.. కూటమి , వైఎస్ఆర్‌సీపీ గెలుచుకునే అవకాశాలు ఉంటాయని అంచనా వేసుకోవచ్చు.

## బిఆర్‌ఎస్ క్యాండిల్ ర్యాలీ

మొదటి పేజీ తరువాయి...

స్తంభించింది. గన్‌పార్క్ దగ్గర తన కోసం వేచి చూస్తున్న పార్టీ నేతల వద్దకు బంజారాహిల్స్ నందీనగర్ నుంచి బయల్దేరి వెళ్లగా లక్డీకపూల్ ట్రాఫిక్‌లో ఆయన చిక్కుకున్నారు. దాదాపు అరగంటకుపైగా ఆయన ట్రాఫిక్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. 10 ఏళ్లుగా అధికార పార్టీ హోదాలో వేడుకలు నిర్వహించగా.. రాష్ట్రావిర్భావం తరువాత తొలిసారి ప్రతిపక్ష హోదాలో కార్యక్రమం జరుపుతోంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో కేసీఆర్ పాల్గొననుండటంతో ఆ పార్టీ శ్రేణులు భారీగా గన్ పార్క్ వద్దకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ప్రజాప్రతినిధులు తదితర ముఖ్య నేతలు గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించనున్నారు. అనంతరం గన్ పార్క్ నుంచి సచివాలయం వద్ద ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి వస్తుండగానే కేసీఆర్ లక్డీకపూల్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

## తిరోగమన దిశలో కాంగ్రెస్ పాలన

మొదటి పేజీ తరువాయి...



22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా మీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్నమార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది మీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉందని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న కాంగ్రెస్ పోకడలను నిరసిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితమని, అమరుల త్యాగాల పర్యవసానమనీ కాకుండా.. కాంగ్రెస్ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ భావ దారిద్ర్యాన్ని నిరసిస్తున్నానని చెప్పారు. ఇకనైనా వైఖరిని మార్చుకుని సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో 369 మంది ముక్కుపచ్చలారని యువకులను కాల్చి చంపిన కాంగ్రెస్ దమననీతికి సాక్ష్యమే గన్‌పార్క్ అమరవీరుల స్థూపమని కేసీఆర్ తెలిపారు. ఆ స్థూపాన్ని కూడా ఆవిష్కరించుకోనివ్వకుండా అడ్డుపడిన కాంగ్రెస్ కర్కశత్వం తెలంగాణ చరిత్ర పుటల్లో నిలబడిపోయిందని అన్నారు. మలిదశ ఉద్యమంలోనూ వందలాది మంది యువకుల ప్రాణాలను బలిగొన్న పాపం నిశ్చయంగా కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని సరిదిద్దడానికి జరిగిన చారిత్రాత్మక ప్రయత్నమే టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అని చెప్పారు. పార్లమెంటరీ రాజకీయ పంథాలో, శాంతియుత మార్గంలో తెలంగాణ సాధన లక్ష్యంగా టీఆర్ఎస్ ఏర్పడటం తెలంగాణ ఉద్యమంలో మేలుమలుపు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపైనా ఆ లేఖలో కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జై తెలంగాణ అనే నినాదాన్ని పలకలేదని.. తెలంగాణ ప్రజలకు ప్రాణ సమానమైన జై తెలంగాణ నినాదాన్ని నోటినిండా పలకలేని మీ మానసిక వైకల్యాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారని తెలిపారు. ఇక ముందైనా తెలంగాణ వ్యతిరేక మానసికత నుంచి బయటపడి జై తెలంగాణ అని నినదించే వివేకాన్ని తెలంగాణ సమాజం మీ నుంచి కోరుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి అయ్యి ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించకుండా, శ్రద్ధాంజలి ఘటించకుండా తెలంగాణ మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. మీ ప్రవర్తనతో, మీ పార్టీ ప్రవర్తనతో కాంగ్రెస్ ఇప్పటికీ మారలేదు.. ఇక మారదు.. ఇక ముందు మారే అవకాశం లేదని స్పష్టమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతున్నది ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని.. బీఆర్ఎస్ పార్టీతో సహా ఉద్యమకారులు, తెలంగాణ వాదులు అభిప్రాయంగా ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న మీ వికృత పోకడలను నిరసిస్తూ.. మీరు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని తెలియజేయడానికి విచారిస్తున్నామని అన్నారు. ఇక ముందైనా ఇటువంటి వైఖరిని మానుకొని నిజమైన ప్రగతి కోసం, సంక్షేమం కోసం ప్రయత్నిస్తారని, ఎన్నికల వాగ్దానాలన్నీ త్వరగానే నెరవేరుస్తారనీ ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

## కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీర్పు

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విభేదించింది. తన ఆరోగ్యంపై ఆయన తప్పుడు ప్రకటనలు చేశారని కోర్టు దృష్టికి తెచ్చింది. తనను నిర్బంధంలోకి తీసుకున్నప్పటి నుంచి 6 కిలోల బరువు తగ్గానంటూ కేజ్రివాల్ చేసిన 'పొలిటికల్ ÷-లకెయిమ్'లో నిజం లేదని పేర్కొంది. పైగా ఒక కిలో బరువు పెరిగారని తెలిపింది. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బదులు దేశవ్యాప్తంగా ఆయన పర్యటిస్తున్నారని కోర్టుకు విన్నవించింది. మధ్యంతర బెయిలును పొడిగించాలని కేజ్రివాల్ కోరడంలో ఔచిత్యాన్ని కూడా ఈడీ ప్రశ్నించింది. రెగ్యులర్ బెయిల్ కోరే స్వేచ్ఛను సుప్రీం కోర్టు ఇచ్చిందే కానీ, మధ్యంతర బెయిల్‌ను పొడిగించమని కోరడానికి కాదని ఈడీ తరపున కోర్టుకు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదించారు.

## ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

హిమాచల్ ప్రదేశ్‌లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ఒకేసారి జరిగాయి. ఈ సాయంత్రం 5 గంటలకు, ఏడు రాష్ట్రాలు, చండీగఢ్‌లో 58.3% ఓటింగ్ నమోదైంది. బీహార్‌లో అత్యల్పంగా 35% కంటే ఎక్కువ ఓటింగ్ నమోదు కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా 48.6% నమోదైంది. లోక్ సభ తుది దశ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ లోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. బెంగాల్ రాజధాని కోల్‌కతాకు దగ్గర్లోని జాదవ్ పూర్ లోక్ సభ నియోజకవర్గంలో సీపీఎం, ఐఎస్ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. సౌత్ 24 పరగణాల జిల్లాలో ఓ పోలింగ్ బూత్ లోకి చొరబడిన జనం.. ఈవీఎంతో పాటు ఎన్నికల సామగ్రిని ఎత్తుకెళ్లి దగ్గర లోని నీటి కుంటలో పడేశారు. భాన్ గర్ నియోజకవర్గంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. తృణముల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఏఐఎస్ఎఫ్ అభ్యర్థికి చెందిన వాహనాన్ని ధ్వంసం చేశారు. అటు ఇదే జిల్లాలోని జయ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కుల్తాలీలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అల్లర్లు చెలరేగాయి. పోలింగ్ బూత్‌లోకి తమ ఏజెంట్లను అనుమతించట్లేదని ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు పొలింగ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతటితో ఆగకుండా మూకుమ్మడిగా పోలింగ్ బూత్‌లోకి చొరబడ్డారు. అటు ఎన్నికల సామగ్రిని చెల్లాచెదురు చేసి ధ్వంసం చేశారు. ఓ ఈవీఎంతో పాటు వీవీప్యాట్ మెషిన్లను ఎత్తుకెళ్లారు. వాటిని దగ్గర్లోని ఓ నీటి కుంటలో పడేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. నీటిలో పడేసిన ఎన్నికల సామగ్రిని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను వెలికితీశారు. అయితే, ఈ ఘటనపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. కుల్తాలీలో ముందు జాగ్రత్త చర్యగా అదనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్లనే నీటి కుంటలో పడేశారని పేర్కొంది. కుల్తాలీ పోలింగ్ బూత్ లో పోలింగ్ యథావిధిగా జరుగుతోందని స్పష్టం చేసింది. సెక్టార్ ఆఫీసర్ కు మరో ఈవీఎంను అందజేసినట్లు తెలిపింది. ఇక ఈ ఘటనపై కుల్తాలీ సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఈసీ స్పష్టం చేసింది. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారని పేర్కొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ బూత్ వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది.

## తెలంగాణలో హస్తానిదే ఆధిపత్యం

మొదటి పేజీ తరువాయి...

ఎంఐఎం పార్టీలకు ఎన్ని ఎంపీ స్థానాలు వస్తాయో తెలుసుకుందాం.

**తెలంగాణ లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్**

**తెలంగాణ(17)**

**సీఎన్ఎన్ న్యూస్ 18**

కాంగ్రెస్ 5-8
బీజేపీ 7-10
బీఆర్ఎస్ -1

**జన్‌కీ బాత్:**

కాంగ్రెస్ 4-7
బీజేపీ 9-12
బీఆర్ఎస్-1
ఇతరులు-1

**ఆరా మస్తాన్ సర్వే**

బీజేపీ 8-9
కాంగ్రెస్ 7-8
ఎంఐఎం 1
బీఆర్ఎస్ 0

**ఇండియా టుడే తెలంగాణ లోక్ సభ ఎగ్జిట్ పోల్స్**

కాంగ్రెస్ 4-6
బీజేపీ 11-12
బీఆర్ఎస్ 0-1
ఇతరులు 1



## మల్కాజ్‌గిరిలో గెలిసేది కాంగ్రెస్ పార్టీయే

### టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి...

కూకట్‌పల్లి, జూన్ 1 (ప్రభాత ఉదయం) పార్లమెంటు ఎన్నికల లెక్కింపు ఈనెల 4 వ తేదీన నిర్వహించనున్న దృష్ట్యా శనివారం మల్కాజ్ గిరి పార్లమెంటు పరిధిలోని మేడ్చల్, మల్కాజ్ గిరి, కూకట్ పల్లి, కంటోన్మెంట్, ఉప్పల్, ఎల్బీ నగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుంచి కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్తున్న వారికి అవగాహన సమావేశాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్లమెంటు ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్ పల్లి నియోజకవర్గాల ఇంఛార్జ్ లు, కొలన్ హన్మంత రెడ్డి, మందుమల పరమేశ్వర్ రెడ్డి, బండి రమేష్, టిపిసిసి జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి భూపతిరెడ్డి, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు లక్ష్మికాంత్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలంలో బోధ వేసి ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాలు

బుద్వేల్, జూన్1(ప్రభాత ఉదయం) : ఖాళీ స్థలంలో బోరు వేసి తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బుద్వేల్ వర్మ కాలనీవాసులు కోరుతున్నారు . ఇదే విషయాన్ని శనివారం రాజేంద్రనగర్ తహసిల్దార్ బి.రాములకు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేసి ఫోన్ లో మాట్లాడినట్లు వర్మ కాలనీ వాసులు ప్రభాత ఉదయంకు వివరించారు . ఓపెన్ ప్లాట్ లో బోరు వేసి పక్క వారి స్థలం నుంచి ప్రతి రోజు తెల్లవారుజామున , రాత్రి వేళల్లో ట్యాంకర్ ల ద్వారా నీటిని తోడుతుండడంతో వర్మ కాలనీలోని తమ ఇళ్లల్లో ఉన్న బోర్లలో నీరు తక్కువయిందని వాపోతున్నారు . ఈ విషయాన్ని గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ , రాజేంద్రనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ అధికారులకు చెప్పిన లాభం లేకుండా పోయిందన్నారు. శనివారం కాలనీవాసుల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ తహసిల్దార్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా 25 నుంచి 30 ట్రిప్పులు నీటిని విక్రయిస్తున్నారని గుర్తు చేశారు. నీటి కోసం ఇబ్బందులు పడుతున్న తమకు ట్యాంకర్ల ద్వారా నీటిని తోడుతుండడంతో తమ బోర్లు ఎండిపోతున్నాయి అని గుర్తు చేశారు.




వర్మ కాలనీ లో ట్యాంకర్ ల ద్వారా నీటి విక్రయాలు



ఖాళీ స్థలం లో వేసిన బోరు

# తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ జి. హరగోపాల్



వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి. హర గోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం. కోదండరాం



దశాబ్ది ఉత్సవాలలో అధ్యాపకులు, ఉద్యోగులు

### అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

### తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర సాధనలో కృషి చేసిన ఉద్యమకారులు, జర్నలిస్ట్ లకు సన్మానం

రాజేంద్రనగర్, జూన్1(ప్రభాత ఉదయం): తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం లో తెలంగాణ దశాబ్ది ఉత్స వాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయాలు ఆరోగ్యకరంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టాసా), బోధ నేతర సిబ్బంది సంఘం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణాలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఇప్పుడే తెలంగాణ వచ్చినట్లనిపిస్తుందని వ్యాఖ్యానించారు. పౌర సమాజం, విశ్వవిద్యాలయాలు చైతన్యవంతంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు నిరంతరము ప్రజలతో చర్చలు సాగిస్తుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవసాయ అభివృద్ధికి ఒక కమిషన్, హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములు పరిరక్షణకు ఒక కమిషన్ ను వేయవలసిందిగా మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు కి సూచించినా, పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రైతుల్లో అధిక శాతం సన్న, చిన్నకారు రైతులే నని వారి అభ్యున్నతిలో వ్యవసాయ విశ్వవిద్యాలయంది కీలకపాత్ర అని ఆయన అభిప్రాయపడ్డారు. మన రాష్ట్రం, దేశము వ్యవసాయ ప్రధానమైనవన్నది గుర్తించి మనం మన బాధ్యతలు నిర్వర్తించాలని హరగోపాల్ సూచించారు. వ్యవసాయ విశ్వ విద్యాలయానికి వైస్ చాన్సలర్ ను నియమించి నిధులను కేటాయించాలన్నారు. వ్యవసాయపరంగా తెలంగాణ అభివృద్ధి జరగడానికి అవకాశాలు ఎన్నో ఉన్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. తెలంగాణకి విత్తనబండాగారం అనే పేరు ఉన్నప్పటికీ సన్నా, చిన్న కారు రైతులకి మేలు చేసే విధంగా గత ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్చలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షదాయకమని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని చిన్న, సన్నకారు రైతుల సమస్యలు, విశ్వవిద్యాలయాల నిధులు, నియామకాలు, స్వయం ప్రతిపత్తి అంశాలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. విశ్వవిద్యాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అందరు కృషి చేయాలని కోదండరాం పిలుపునిచ్చారు. తెలంగాణ పునర్నిర్మాణానికి మన అందరమూ మన బాధ్యతలను నిర్వర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపించినప్పుడే అమరవీరుల త్యాగాలకి అసలైన ఫలితం ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టాసా అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, బోధనేతర సిబ్బంది సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ వనమాల, ప్రజా గాయకుడు గద్దర్, కుమార్తె డాక్టర్ జి.వి వెన్నెల ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల్ని, ఉద్యమ కాలంలో చురుకుగా పనిచేసిన పూర్వ అధ్యాపకుల్ని, జర్నలిస్ట్ లు అప్పరెడ్డి గూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, పాలేపల్లి వెంకటేష్,, ఎద్దుల సుజీవన్ రెడ్డి, పి. సూర్య కిరణ్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు



అప్పారెడ్డిగూడెం భీమయ్య



మేకల దామోదర్ రెడ్డి



పాలేపల్లి వెంకటేష్



ఎ. సుజీవన్ రెడ్డి

### తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా

## పలువురికి సన్మానం


రాజేంద్రనగర్, జూన్1(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ ( టాసా), వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శనివారం రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో రాజేంద్రనగర్‌కు వచ్చి సంఘీభావం తెలిపిన వారిని, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యమాలు చేసిన వారికి, సహకరించిన పాత్రికేయులను గుర్తించి సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ హర గోపాల్, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా గాయకులు దివంగత గద్దర్ కుమార్తె డా. జి. వి. వెన్నెలతో పాటు వర్సిటీలో జరిగిన తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన అధ్యాపకులు శాస్త్రవేత్తలు డాక్టర్ వి. వాసుదేవ్, డాక్టర్ బి విద్యాసాగర్, డాక్టర్ ఎల్ జలపతిరావు, డాక్టర్ సురేందర్ రాజు, డాక్టర్ వీరన్న గౌడ్ , సిబ్బంది నాయకులు ఎం శ్రీనివాస్ యాదవ్, ఎం నర్సింగ్‌రావు, పోతురాజు యాదయ్య, ఎం.ఎ. నయీమ్, ఎం.రాజులతోపాటు పాత్రికేయులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, పాలేపల్లి వెంకటేష్, పి సూర్య కిరణ్ , ఎ. సుజీవన్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ కారిణి తెప్ప అరుణ, విశ్రాంత ఉద్యోగులు జి అంజయ్య గౌడ్, ఎం నాగులు యాదవ్‌తో పాటు పలువురిని సన్మానించి మెమెంటోలను బహుకరిం చారు. కార్యక్రమంలో డాక్టర్ రజనీకాంత్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.




ప్రజాగాయకులు గద్దర్ కుమార్తె డాక్టర్ జి. వి. వెన్నెల



ప్రొఫెసర్ జి. హర గోపాల్ - డాక్టర్ వనమాల లకు సన్మానం



వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. జలపతి రావు



ప్రొఫెసర్ ఎం. కోదండరాం కు సన్మానం



ప్రముఖ వరి శాస్త్రవేత్త డాక్టర్ సురేందర్ రాజు



రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల విశ్రాంత అసోసియేట్ డీన్ డాక్టర్ వీరన్న గౌడ్



ఆర్ ఎన్ ఆర్ 31479 వరి విత్తనాల కోసం క్యూ కట్టిన రైతులు

## ఆర్ ఎన్ ఆర్ 31479 వరి విత్తనాలకు బలే డిమాండ్

బుద్వేల్, జూన్1(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ వరి పరిశోధనా సంస్థలో శనివారం ఆర్ ఎన్ ఆర్ 31479 రకం అతి సన్నగింజ స్వల్పకాలిక వరి రకాన్ని రైతులకు అందజేశారు. ఆర్ ఎన్ ఆర్ 31479 రకానికి డిమాండ్ ఎక్కువ ఉండడంతో 300 మంది వరకు రైతులు వరి పరిశోధన సంస్థ వద్దకు వచ్చారు . ఈ రకానికి ఎక్కువ ఆదరణ ఉండటం, చాలామంది రైతులు రావడంతో ఒక్కొక్క రైతుకు రెండు ఎకరాలకు సరిపడే విత్తనాన్ని మాత్రమే శాస్త్రవేత్తలు అందజేశారు.





## ఘనంగా హనుమాన్ జయంతి

### శ్రీ వీరాంజనేయ స్వామికి తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్,జూన్ 01(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఆంజనేయ స్వామి ఆలయాలలో వైభవంగా వేడుకలు జరిగాయి.స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతోపాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు,యజ్ఞాలను నిర్వహించారు.ఈ సందర్భంగా బుద్వేల్ లోని గ్రీన్ సిటీ ప్రాంతంలో పురాతన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ముక్కు చెల్లించుకున్నారు. ఆంజనేయ స్వామి చల్లని అసిస్సుకు దీవెనలతో ప్రజలందరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని తోకల శ్రీనివాస్ రెడ్డి అక్షాంక్షించారు.ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





## తెలుగుదేశం బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

### చంద్రబాబు నాయుడు



రాజేంద్రనగర్,జూన్01(ప్రభాత ఉదయం) తెలంగాణలో తెలుగుదేశం బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి శనివారం చంద్రబాబును కలిశారు.తెలంగాణ సహా హైదారాబాద్ నగరంలో నెలకొన్న స్థితిగతులు,తాజా రాజకీయ పరిణామాలను వారు బాబుకు వివరించారు.ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల పార్టీకి ముఖ్యమేనని చెప్పారు.తెలంగాణలో పార్టీని పటిష్టం చేయాలని, వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం కావాలని ఆయన సూచించారు.స్థానిక సమస్యలపై ఉద్యమించడం ద్వారా కార్యకర్తలు స్వతంత్రంగా వ్యవహరించి ఎదగాలని,పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని దిశా నిర్దేశం చేశారు.తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావడానికి పూర్తిగా సహకరిస్తానని, రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉండాలనేదే తన కోరిక అని బాబు తెలిపారు.

## బుద్వేల్ గ్రీన్ సిటీ ఏటి ఒడ్డున గల శ్రీ భక్త వీరాంజనేయ స్వామీ దేవాలయంలో హనుమాన్ జయంతి, సీతారాముల కల్యాణం



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న పెండ్యాల సాయి మల్లిక్, జి. హరికిరణ్ గౌడ్ తదితరులు

బుద్వేల్, జూన్1(ప్రభాత ఉదయం): హనుమాన్ జయంతి సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని బుద్వేల్ లోని గ్రీన్ సిటీ ప్రాంతం లో పురాతన దేవాలయం శ్రీ భక్త వీరాంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఈ పూజలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రజలందరికీ హనుమాన్ జయంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. స్వామి వారి చల్లని అసిస్సుకు దీవెనలతో ప్రజలందరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, స్థానికులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పెండ్యాల సాయి మల్లిక్, జి. హరికిరణ్ గౌడ్ ల ఆధ్వర్యంలో....

పెండ్యాల సాయి మల్లిక్ , జి హరికిరణ్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జన్మదినం సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధికి అందరం కృషి చేద్దాం

### మండల అభివృద్ధి అధికారి సంధ్య. వివిధ శాఖల అధికారులతో సమన్వాయ సమావేశం



మొయినాబాద్ జూన్ 01(ఉదయం) అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో అందరం అధికారులం భాగస్వాములై కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖకు అనుగుణంగా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి బడి బాట ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలకు సంబంధించిన వాటిపై సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా ఈ విద్యా సంవత్సరం జూన్ 12న పాఠశాలలు పునప్రారంభం కానుండడంతో ప్రభుత్వం ద్వారా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, ఉచిత భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కలకలలాడే విధంగా ఉండేలా ఉ పాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారంగా పాఠశాలల్లో మరమ్మత్తుల్లో తరగతుల్లో రంగులు వేయడం గ్రీన్ బ్లాక్ బోర్డు ఏర్పాటు చేయడం, ప్రహరీ గోడల మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం ద్వారా లక్ష రూపాయలు అందించడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 1380 స్కూల్స్ మొదటి విడతలో ఎంపిక చేశారని అందులో మొయినాబాద్ మండలంలో మొదటి విడత 19 పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 51 పాఠశాలల్లో 19 పాఠశాలలను తీసుకోవడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో మరమ్మత్తులకు లక్ష రూపాయలకు అదనంగా అయ్యే ఖర్చు ఉంటే రివైజ్ ఇస్టిమెంట్ చేసి పంపిస్తే అధికంగా లక్షకు పైగా వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ నెల 3 నుంచి 17 వరకు బడి బాట... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ విద్యా సంవత్సరం పునప్రారంభం కానుండడంతో గ్రామాలలోని ఆయా పాఠశాలల ద్వారా అన్ని శాఖల అధికారులు పాల్గొని బడి బాటను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ బడిబాట రేపు 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమై 17వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు పునప్రారంభం ఈ నెల 12న జరుగుతాయని విద్యార్థులకు కావాల్సిన యూనిఫామ్, భోజనం, పుస్తకాలు అన్ని ముందుగానే సమకూర్చుకోని పంపించాలని తెలిపారు. ఎలాంటి లోటు అవకతవకలు ఉన్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, మండల సెక్టోరియల్ అధికారి జావిద్ అహ్మద్, మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, మండల ఎంపివో వెంకటేశ్వర్రెడ్డి, మొయినాబాద్ పోలీస్టేషన్ ఎస్సై నర్సింహులు, ఐకేపిఏపిఎం అధికారి రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్, సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

### అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి..



కూకట్‌పల్లి, జూన్ 1 (ప్రభాత ఉదయం) తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాపిరెడ్డీ నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరెకేపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నివాసం నుండి అమరవీరుల స్థూపం వద్దకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమములో కూకట్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి, నాగేశ్వర్ రావు, ఎల్లం నాయుడు, సీనియర్ నాయకులు మాయ రాజయ్య, చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి, తిరుపతి రావు, ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, మాయ బాల నరసయ్య, రవీందర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, స్వామి, వీరన్న, లక్ష్మణ్ మేస్త్రి, బాలశౌరి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా రెడ్డి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతీలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు

కొత్త కోట,జూన్ 2 (ప్రభాత ఉదయం) కొత్తకోట మండల కేంద్రంలో వాగులో ఉండే ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా హనుమబలం...అసమానమైన భక్తి నిస్వార్థ సేవకు ప్రతీక ఆయిన ఆంజనేయుడు ప్రజలందరికి బలాన్ని ఆశీస్సులు ఇవ్వాలని కోరుకుంటున్నాము.లి జయంతి పూజలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పి ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పి కృష్ణారెడ్డి, అప్పరాల మాజీ సర్పంచ్ ,మాసన్న, కాంగ్రెస్ పార్టీ టౌన్ నాయకులు డి రాముల యాదవ్, కురుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## వాడవాడలా ఘనంగా హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు

### ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్.

కూకట్‌పల్లి, జూన్ 1 (ప్రభాత ఉదయం) హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారి ఆలయాలన్నీ శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆంజనేయస్వామి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చారు. కూకట్ పల్లి బాలాజీ నగర్ లోని హనుమాన్ ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బండి రమేష్ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆంజనేయస్వామిని కోరుకున్నట్టు ఈ సందర్భంగా బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరీ సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, నాగర్జున, శివ చౌదరి, బండి సుధా, పుష్ప రెడ్డి, రమాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యాన విశ్వవిద్యాలయం,ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్‌ల అవగాహన ఒప్పందం

సిద్దిపేట, జూన్2(ప్రభాత ఉదయం) సిద్దిపేట లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు, సిద్దిపేట జిల్లా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్ ల మధ్య శనివారం ములుగులోని విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యాలయంలో ఉపకులపతి డాక్టర్ బి. నీరజా ప్రభాకర్ , విశ్వవిద్యాలయ అధికారుల సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. అవగాహన ఒప్పందం పై విశ్వవిద్యాలయము తరపున అధికారులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ తరపున డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సిల్వియా సంతకాలు చేయడం జరిగినది. ఉపకులపతి డాక్టర్ బి. నీరజా ప్రభాకర్ ఈ ఒప్పందాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో మరియు స్థిరమైన ఉద్యాన పద్ధతులను ప్రోత్సహించడంలో ఈ భాగస్వామ్యం యొక్క ప్రభావాన్ని, ఇది రైతు సమాజం సాధారణ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంటుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశ్యము సహకార పరిశోధనను ప్రోత్సహించడం , పోషకాహార శాస్త్రం మరియు ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు మరియు సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను సులభతరం చేస్తుంది, పోషకాలు అధికంగా ఉండే పంట రకాలను అభివృద్ధి చేయడం మరియు ప్రజారోగ్య ఫలితాలను మెరుగుపరచడంపై దృష్టి పెడుతుంది. పోషకాహారం మరియు ఉద్యాన ఉత్పత్తుల యొక్క ప్రయోజనాల గురించి అవగాహన పెంచడానికి కమ్యూనిటీ అవుట్ రీచ్ ను కూడా ఈ సహకార ఒప్పందము ప్రోత్సహిస్తుంది. ఈ సమావేశంలో డాక్టర్ ఎ. భగవాన్ పాల్గొన్నారు.





## బక్రీద్ సందర్భంగ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

### శాంతి సంఘం సమావేశంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు

శంషాబాద్, జూన్ 1( ప్రభాత ఉదయం) ఈనెల 17వ తేదీన బక్రీద్ సందర్భంగా నిర్వాహకులు అందరు తప్పనిసరిగా నిబంధనలు పాటించి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని శంషాబాద్ ఏసిపి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం శంషాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన బక్రీదు ఉన్న సందర్భంగ అందరూ శాంతియుత వాతావరణంలో బక్రీద్ నిర్వహించుకోవాలని సూచించారు. శాంతియుతంగా సోదర భావంతో బక్రీద్ జరుపుకునే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటారని ప్రజలు కూడ అందుకు పూర్తి సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. బక్రీద్ సందర్భంగా ఆవులను తరలించడం. వధించడం లాంటి చర్యలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలోని అన్ని వర్గాల వారు ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తూ తమ తమ పర్వదినాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఏసిపి శ్రీనివాసరావు.ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి సూచించారు. బక్రీద్ సందర్భంగా జంతువాద చేయడం జరుగుతుందని అయితే ఆవులను వధించడాన్ని ఎట్టి పరిస్థితులలో ఆమోదించమని తెలిపారు. ఎద్దులను వధించాల్సి ఉన్న డాక్టర్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని. ఎవరైనా అభ్యంతరాలు తెలిపిన వివాదం ఉన్న వెంటనే 100 నెంబర్ కు డయల్ చేసి సమాచారాన్ని అందించాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తామని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పసి ఉద్దీన్ అహ్మద్ పోలీస్ అధికారులకు తెలిపారు. పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయని అందుకు తాము కూడా పూర్తి సహకారాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. శాంతి సంఘం సమావేశంలో హమీదుల్లా నగర్. రషీద్ గూడ. చిన్న గోల్కొండ. నర్కూడ. కాచారం. పాలమాకుల. గాంసి మియా గూడ. పెద్ద షాపూర్. జూకల్. తదితర గ్రామాలకు చెందిన మత నాయకులు పాల్గొన్నారు.



## ఆశాల వర్కర్లకు ఎగ్జామ్ పెట్టే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి: సీఐటీయు

కూకట్‌పల్లి, జూన్ 1 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హస్మత్ పేట, కూకట్ పల్లి, ఎల్లమ్మబండ యూపీహెచ్ సీ లల్లో మరియు బాలానగర్ పిహెచ్ సి లలో సీఐటీయు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ లు వినతిపత్రాలను అందజేశారు. ఆశాలకు నష్టం కలిగించే, ఎగ్జామ్స్ పెట్టె నిర్ణయన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషకాలను రూ.18 వేలకు పెంచి ఫిక్స్ వేతనంగా నిర్ణయించాలని, అదేవిధంగా గతంలో ఇచ్చినట్టుగా ఆశాలకు ప్రతినెల రెండవ తేదీననే పారితోషికాలు చెల్లించాలని, మరియు అంశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ సర్టిఫికెట్ జారీ చేయాలని, అట్టి ఖర్చులకి రూ.50 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద ఐదు లక్షలు చెల్లించాలని, ఇస్తున్న పారితోషకంలో సగం పెన్షన్గా చెల్లించాలని మూడు సంవత్సరాల పెండింగ్ లో ఉన్న యూనిఫామ్ ను వెంటనే ఇవ్వాలని, మరియు పారితోషికం లేని పనులు చేయించు వద్దని, బీపీ, షుగర్ టెస్టులు ఎన్సీడీ, ఆబా కార్డ్స్ తదితర ఏఎన్ఎం ల పనులను ఆశాలతో చేయించి వద్దని, అంశాలకు పని భారం తగ్గించి, జాబ్ చార్ట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు అనిత, సబియా, పద్మ, శ్రీదేవి, మంజుల, సుహాసిని, సుమలత, వినోద, సంతోషిని, పర్వీన, సోమలత, అఖిల, రూబీని, రవళి, స్వర్ణ, పద్మ, రాణి, లలిత, ఆఫ్రిన్, స్వాతి,దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామాలలో హనుమాన్ జయంతి



మొయినాబాద్ జూన్ 01( ఉదయం ) మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల హనుమాన్ దేవాయాల్లో హనుమంతుడి జన్మోత్సవాలను దేవాలయాల్లో వేధపండితులు, పూజారులు వేధమంత్రోచరణాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకోని ఆయా గ్రామాల్లో ఉన్న హనుమాన్ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని అజీజ్నగర్, అమ్డాపూర్, తోల్కట్ట, కేతిరెడ్డిపల్లి, బాకారం, హిమాయత్నగర్, ఎన్కెపల్లి ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచే దేవాలయాలకు వచ్చి పూజారులు నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. దేవాలయాల్లో పూజారులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని చదివించి వినిపించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.





## పరిశోధనలతో సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలి

### చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ క్రిష్టఫర్. స్వప్న మిట్టపల్లికి డాక్టరేట్.

మొయినాబాద్ జూన్ 01(ఉదయం): ప్రస్తుత కాలంలో జీవ సాంకేతిక రంగం సజామానికి ఎంతో అవసరమని పరిశోధనలు చేస్తున్న ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని అప్పుడే తమకు గుర్తింపు లభిస్తుందని చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య క్రిష్టఫర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్నగర్ సమీపంలో గల చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీలో స్వప్నమెట్టుపల్లి జీవ సాంకేతిక శాస్త్ర విభాగంలో స్టడీస్ ఆన్ జెనటిక్ ట్రాన్స్ఫరేషన్ ఆఫ్ డిఫెన్స్ జీన్ అగేన్ ఫంగల్ పతోజన్ ఇన్ గ్రౌండ్ నట్ (అరకీస్ ఐపోజియా) అనే అంశంపై రాజేందర్ పాడ్లురి పర్యవేక్షణలో స్వప్న మిట్టపల్లి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తు శనివారం డాక్టరేట్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ క్రిష్టఫర్ పాల్గొని డాక్టరేట్ ప్రధానం చేసి ఆయన మాట్లాడుతూ పరిశోధనలు సమాజంలో ప్రజలకు, పర్యావరణానికి సంబంధించి మెరుగైన పరిశోధనలు నిర్వహించినప్పుడే మీకు గుర్తింపు అనేది లభిస్తుందన్నారు. స్వప్న మెట్టుపల్లి నిర్వహించిన జీవ సాంకేతిక శాస్త్రంలో మంచి పరిశోధన నిర్వహించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, సుందర్రామ్, రాజు, గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు చదువులలో రాణించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలి

### బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్..





కూకట్‌పల్లి, జూన్ 1 (ప్రభాత ఉదయం) అమ్మాయిల చదువు అవనికే అందమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ప్రాంతానికి చెందిన ఎస్ మురళీకృష్ణ కుమార్తె ఛార్మిక షంషీగూడ ప్రభుత్వ పాఠశాలలోచదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి టాపర్ గా నిలిచినందున శనివారం ఆయన శాలువాతో సన్మానం చేసి నగదు ప్రోత్సాకాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ అమ్మాయిల చదువుల శాతం పెంచడం కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ బేటి బచావో, బేటి పడావో అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. పేద కుటుంబానికి చెందిన చార్మిక అరకొర వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివి మెరిట్ సాధించడం తల్లిదండ్రులకు గర్వకారణం అన్నారు. పిల్లలందరూ చెడు అలవాట్లకు అలవాటు పడకుండా చదువులలో రాణించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలి అన్నారు. అలాగే భవిష్యత్ లో కూడా డివిజన్ లో ప్రభుత్వ పాఠశాలలో చదివి టాపర్ గా నిలిచే విద్యార్థులందరికీ ప్రోత్సాకాలను అందిస్తామన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.